హంసపాదలు

* * *

అది...రమాకుమారుని విజయసాధన పరంపరలో...అప్రతిమానంగా వన్నెలు తీరుస్తూన్న...ఏకైక ధర్మము. ఎలాచూర్ణ సంయోగము...ఇక్షురసము తీయదనమును...కల్పించే మాదిరి పరిణయములో కారణము కనుపించని పొలయలుక...విలువ.

కాని...తూకము చలించనీయని...ధీరమానసులు ఎందరు..?

గులాబీలు...

ఉదయ-మందపవనకుమార నవలాలనలో పులకరించే విరి చేడియల తరితీపులు...కుసుమసుకుమారిని అలరించడం...సైదోడైన యౌవనరసికమూర్తి...అలంకరణమునకు...ముందంజవేయడం:

—అంతవరకూ ఉచితంగానే ఉన్నది. గులాబీలను చూసి, మోహిని.. ముచ్చట పడింది. మంచుతడి ఆరకముందే...అరవిరిసిన మొగ్గలనే తుంచి, సిగలో అలంకరించాలని, శివరావు కల్పించుకుని నెచ్చెలి మాటను చిరునవ్వుతో తోసివేసి...పట్టుపట్టడం చేత... ఆమె, పెదవులమీది హాసరేఖను...మాయం చేసుకుని...ఆతన్ని అలయించింది.

'కోయవద్దు...నామాటవినవూ?' అని, మాలతి బ్రతిమాలింది. ఆతడు వినిపించుకోలేదు.

'నాకు కోపంవస్తుంది...'—నయనాంచలముల కెంపుల చాయలు మొలకలెత్తించింది. ఆతడు లెక్క చేయలేదు...

‘ కోసినా…అక్కర్లేదు ’— బెదిరించింది. కాని ప్రేమో జనంలేదు. అప్పటికప్పుడే…కావలసినన్నీ…చాలినన్ని తుంచేశాడు. తలలో తురుమవలెనని దగ్గరకువచ్చాడు. ఇక చెలగాటం ప్రారంభ మైంది ! అందుకోలేకపోతానా అని, ఆతడు ; అందుతానా అనే ధీమాతో, మోహిని! తోటఅంతా…కలయవేసి…చివరకు…జాజి పొదలో పొంచిఉంది. కౌగిట చిక్కించుకున్నాడు…! పెనుగులాడి, విడిపించుకుని…పారిపోకుండా, నిలిచింది ప్రతిఘటిస్తూ…

‘ పోనీ…నీవు…అలంకరించుకో… ’

‘ ఊహు… ’

‘ దండ కట్టియివ్వనా ?

‘ గోహార్ లాగా…చెంపకుచ్చు… ’

— ఒకఉపాయాగనోము! చెయిచేసుకుని, సందిటపొదివి పట్టుకుని…బలవంతాన… తనకు అందమని తోచినమాదిరి…తలంతా ముడిచేశాడు. ఇనకరస్పర్శాచకిత ఉషాబాలలాగా…కిలికించితము …సహజంగా అభినయించింది— హర్షము… నవ్వువెన్నెల… వెంటనే…కోపము నిలకడగా…

గులాబీలన్నీ లాగి…చిమ్మేసి, తలంతా రేగగొట్టుకున్నది. పోనీ…జాజులనైనా కనికరించమన్నాడు. మల్లెలు…? ఊహుఁ…అంత చులకనగా లొంగిపోవడమేనా ?…ఆతడు దోసిలి నించుకున్న పూలను గారవించడమే ?…

ఏ జాతులూ…సరిపడలేదు. ఆతడు వెన్నాడి బలవంతంచేయడం…బ్రతిమాలటం మానలేదు…

మందార… !

పరుగెత్తుకుని వెళ్లి…మందార ముద్దబంతిని…కోసి…తలలో పెట్టుకున్నది. అవి ఆతనికి నచ్చవని తెలుసును…మరీమంచిది… !

'చూడలేను...తీసివేయి...'

'ఎంత అందంగా ఉన్నదో'

'లేదు...వినవూ...?'

'నీకేం తెలుసు...'

'లాగి వేస్తాను...'

'నీ...తరమే...'

—ఆతని చేతులో, మోహిని అంత...ఒళ్లు తెలియని... ఉత్సాహ-సరస ఆవేశంలోకూడా కొంచెం మోటుగా...ఉండక తప్పి నదికాదు. మందారాన్ని...లాగి, విసిరి వేశాడు...

మోహినికి...ఓడిపోయిన ఉక్రోశంతో...కనులవెంట నీళ్ళు వచ్చినవి. మెరుపులు...!

వశిసన్నను చేసుకుందామని...లాంఛనములన్నీ...ప్రయో గించి—మర్యాద...అనునయం...వినయాంజలి... ఏమీ లాభం లేదు...

'నాతో...మాటాడవద్దు...పో'—అక్కడ నిలువకుండా... మేడలోకి పరుగెత్తుకుని పోయింది. అందుకోగలడు, ... ఆ బాల కురంగినిని...ఆపివేసి...కిలకిలలాడించి...వదలగలడు...! కాని... ఏమనుకున్నాడో, మొదట కొంచెం చిన్నబుచ్చుకున్నా...సహజ గాంభీర్యముతో...ఆమె వెళ్ళినవేపే చూసి...చూసి...మనసు మార్చుకుని మళ్ళా వస్తుందేమోననే ఆసతో... కాచుకుని... తోచక...వెళ్ళిపోయినాడు...

—పోయి...పరధ్యానంగా, కుర్చీలోకూర్చుని...గతరాత్రి... శేషించిన...కథాభాగమును చదివివేదామని ... పుస్తకాన్ని అందుకుని...సాగక, చిరాకుతో...నిష్కారణ వైరంతో, మూలకు విసిరివేసి...మానసవిహారిణి అయిన పత్నియినీమూర్తిని...రేఖ లలో చిత్రించుదామని...లక్ష్యము కుదరక...కలవరపడుతూ...

ఆమె వస్తుందేమో...రమ్మని కబురైనా పంపుతుందేమో...పోర్టికోలో కనబడుతుందేమో అని...కిటికీదగ్గరగా నిలుచుని ..వాళ్ల యింటివైపే...చూస్తూ ఉన్నాడు—

వచ్చింది...

ఆమె కాదు...! కాకపోయినామాత్రమేం...ఆమెపంపిన...ఉత్తరం!

తీసుకుని వచ్చిన జవానుకు బల్లమీద ఉన్న పర్సు...వినాయకుడులాగా ఉబికి ఉన్నది...బహుమతీచేసి...బయటకుగెంటి,...చించి...ఒక్క చూపులోనే చదివేసి...భగ్నములైన...ఆశాసౌధములతోపాటు...తానూ సోఫాలోకి కూలిపోయినాడు...

"మాయింటిచాయలకు రావద్దు...మన యిద్దరికీ, యింతటితోసరి..."

—ఇంతటితోసరి...దేనికి...?ఆమె ప్రేమకు నోచుకొనని...దర్శన భాగ్యమైనా లేని...శుష్క-జీవనము ఇంతటితో...సరి...అని ఆమె ఊహించకలదా?...

తన అపచారము ఏమున్నది: చేసినచేతకు మారుతీర్పులేని అరసికురాలా? ... ప్రణయసరణిని ఎరుగని...అమాయకురాలా? ...ప్రేమతో...అనురాగోద్వేగహృదయంతో...ఆడిన ఆటలు... ముచ్చటలు...వంచనలని భావించిందా... లేక...?

...మోహిని...ప్రకృతే అంతా?...నమ్మించి...వలచినట్లు మోసగించి...చివరకు గికురించి...నిర్దయతో వదలివేసే...కపటి కాదు...ఎన్నటికీ కాదు...! మొదట ... ప్రణయాంజలిని... మన్నించి...దీనుని ధన్యచేసినది...ఆ దేవికాదూ...? జీవితమునకు నూతనశోభలు...ప్రణయవ్యాఖ్యను... రచించినది... ఆ అమృత మూర్తి కాదూ? ... కాని—

ఇంతలో మనసు మారిపోవడానికి... స్వర్ణస్వప్నావళి... త్రుటితముక్తాదామము కావడానికి...

కారణం...? ఏమికారణము కావాలి?...జీవితమే విద్యుచ్చిరమని...భగవత్పాదోక్తి లేదూ...? ప్రణయం...క్షణభంగురం అయితేమాత్రం...ఆలాటప్పుడు...వింత ఏమున్నదీ...?

'త్వమసి మమజీవనమ్'...! ఎవరిని నమ్ముకుని... హృదయ సర్వస్వము అర్పణచేసినాడో... ఆమే...అకారణంగా తృణీకరిస్తే... ఇంకా...

ఇంకా... బ్రతుకు ఎందుకు?

పరిపరి విధముల ఆలోచించి చూశాడు—ఏ మార్గము ఉచితమూ... సులువైనదా అని...? ఏమీ పాలుపోలేదు. జీవించడం ఎంత కష్టముగాఉన్నదో... స్వస్తిచెప్పుకునేందుకు అనువైన ఉపాయముకూడా... అగమ్యముగానే ఉన్నది. మామూలు విధానములు... రభస... ఏమీ నచ్చలేదు...

...కాలము గడచిపోతూన్నది. తోచడములేదు—దోవ, తెన్నూ. చనిపోవడానికి నిశ్చయించుకున్న తరువాత ... ఇక... మోహిని, దయతలచి, కటాక్షిస్తుంది అనే ఆశ రూపుమాసిపోయిన తరువాత...ఆలస్యం ఎందుకూ— మసలినందువల్ల ప్రయోజనం ఏమన్నా వున్నదిగనుకనా? ...

కాని, కళారాధనలో గడపిన జీవితం... అభిరుచుల వన్నెలతో శబలించిన చైతన్యము...గ్రామీణవైఖరిని అస్పందితం కానీయడం...గిట్టడములేదు. అందమైన జీవనరోచి...అందాల వెల్లువలోనే కలసి...మలగిపోవాలి...ఏలా?

అదాటున లేచి...ఫోను అందుకుని... బాబును పిలిచాడు. కష్టసుఖములు...లోతుపాతులు...ఎరిగిన సహృదయుడు...ఆప్తుడు ఆతడు ఒక్కడే...శివరావుకు. ఆతని దగ్గర ఏమీ దాచడు. ఆతని సలహా...సంప్రదింపులేనిదీ, ఇంతవరకూ, ఏపనీచేసినవాడు

కాదు. ఇప్పుడు...మాత్రం... ఆతడే ఒడ్డు ఎక్కించాలి...దోవ చూపించాలి—

శివరావు కలవరపాటును...ఫోనులో గమనించీ...ఆకళించీ కూడా...బాబు...సహజ హాస్య-చలాకీ వైఖరిలోనే ... విసుగించుతూ సంభాషణ నడిపాడు. వస్తానని...వెంటనే బయలుదేరి... వప్పుకునేటట్టు నచ్చచెప్పి...అత్యవసరాన్ని గుర్తించేటట్టు చేసేటప్పటికే... పెద్దలు దిగివచ్చారు. బాబు పెట్టిన తిప్పలన్నిటికీ...ఫోను మీద కసిదీర్చుకుని...ఇక, ఆతనిరాక నిరీక్షించుతూ...విళంబన మూలమున...రేకెత్తుతూ పీడిస్తూ ఉన్న ఆశాలతను ఛేదించుకుంటూ...నిమిషం యుగమంత యాతనతో...

హుషారుతో...మేడమెట్లు ఎక్కివస్తున్న టక...టక...

శివరావు...ఆ అయిదు నిమిషములనుంచీ అనుభవించుతూన్న వేదన అంతా...కవళికలో...కేంద్రముగా ప్రతిబింబించుకుంటూ...చూడగానే, బాబు సానుభూతి చూపేటంత సానుతాపంగా, గాభరాపడేటంత చిన్నబుచ్చుకుని...కూర్చుని ఉన్నాడు.

బాబు విసురుగావచ్చి...కుర్చీలో కూలబడి...

'ఏమిటోయ్...విశేషం? రాత్రికి నాటకం ప్రయాణమేమన్నా ఉందా ఏం?'

'లేదు...'

'మరి...వ్రాసిందేమన్నా చదివి వినిపించడానికా...?'

'ఊహు...'

'అర్జంటుగా...ఊదావు సందేశం...ఏం మునిగిందని...?'

'నీ...ధోరణే నీది...'

'అదేమిటి...ఆ అపోహ ఒకటి ఎందుకూ...? మొదలెయ్యి... వినేందుకే వచ్చాను. తప్పుతుందా...'

'ఎప్పుడూ నువ్వు ఇంతే, బాబూ...'

'దానికేంలే...ఉపక్రమించు...'

'నేను...ఆత్మహత్య చేసుకుందామనుకుంటున్నాను...!'

'నిజంగా...'—బాబు ఏమీ చలించలేదు— ఇంత పిడుగు పడినాకూడాను.

'అవును...ఈలాటి విషయాలలో...అబద్ధం ఆడుతానా ?'

'లేదులే...నీ సంగతి తెలియదుగనుకనా...? సరే... నన్ను పిలిపించిన—'

'నీతో చెప్పి పోదామని...'

'ఓహో...అదా ?... విల్లూ గిల్లూ వ్రాసి..ఎక్సిక్యూ టరుగా ఉండమంటావా ఏం ?'

'నా దగ్గర...ఏమున్నదని...'

'అవునులే,...అయినా...ఎంత లేకపోయినా...'

—చూపులతోనే శివరావు దృష్టినికూడా బంధించి...బల్ల మీద...బంగారపు సిగరెట్ కేసు వంకకు మరల్చి...నిర్దేశించి—

'నేను...తీసుకుంటాను'— అని జవాబుకోసం నిలువ కుండా...జేబులో వేసుకున్నాడు.

'వద్దు ..అది వుండనీ...ఎవరో...యిచ్చిన బహుమతి...'

'అయితే మాత్రం...ఇక...నీవు ఏంచేస్తావూ ?'

'నిజమే...'

'మరి...నీ యితరసరంజామా—పుస్తకాలు...సోఫాలు... టీసర్వీస్... పోయేవాడవు...నాకు యిచ్చేసేద్దూ...'

'పోయేవాడవు...' అని పదిమాట్లు వినడం శివరావు మన సుకు కష్టంగా ఉన్నది. నిజంగా పోయేవాడైనా...ఆతలపు... దానికి పూర్వరంగమైన విఫలగాథను...ఇంకొకరు తరవడం...

దుస్సహము...! కాని...కొంచెంసేపు ఓపికపట్టుకుని ఉంటే...ఈ కష్టములన్నీ తప్పుతాయి. కలకాలం...

'తీసుకో...నీకు కావలసినవన్నీ...మరి. కడసారి...ఈ జన్మకు ఇదే...అర్థించుతున్నాను—చక్క-గా కడతేరే...ఉపాయం ఏమన్నా చెప్పు...'

'నీకన్న నేను ఏమంత ఘటికుణ్ణి...'

'నాకు తోచలేదు...నీవు చెప్పక తప్పదు...'

'...ఉరి...విషం...బాకు...రివాల్వర్...'

'ఏవీ...నచ్చలేదు. ఆదిత్రియమూ...అసహ్యం,...నాలుగో దానితో... పేచీలేదుకాని...అభావే...'

'ఎలెక్ట్రిక్ తీగ...'

'అమ్మయ్యా...!'

—తరుణోపాయం చూపించినందుకు...శివరావు...అనేక విధముల కృతజ్ఞతను తెలుపుతూ... పొగడుతున్నాడు. బాబు, ఆ మాటలు ఏమీ వినిపించుకోక... క్రొత్తగా సంక్రమింపబోయే ఆస్తిని, యజమాని దర్జాతో... సరిజూచుకుంటున్నాడు— సిగరెట్ పొగలు వయారంగా వదులుతూ... శివరావు అక్కడ ఉన్నాడు... ఇంకా జీవముతోనే... అనే సంగతికూడా మరచిపోయినట్లు!

'ఇదిగో... ఇది ఏమిటోయ్...?' —డ్రాయరు సొరుగులన్నీ శోధించుతూ... కాగితం పైకితీసి... చదవబోతూ... శివరావు మీదికి... ప్రశ్న భుజంమీదుగా విసిరాడు. ఆతడు, పోల్చుకుని... చప్పున లేచి... కాగితం ఒడుసుకునే ప్రయత్నంలో...

'వద్దు... చూడవద్దు... రహస్యం...' అన్నాడు.

'ఇంకా... రహస్యమేమిటి...?'

'మోహినికి... కడసారి... వ్రాసి...'

—శివరావు...మనసు పట్టలేక...జరిగిన యావత్తు కథనూ బాబుకు వివరించి...అలా ఉత్తరము వ్రాసిపెట్టి చనిపోతే... చేసిన అపరాధం పరిమితి అప్పుడన్నా ఆమెకు తెలిసి...తప్తహృదయంతో...భావనలోనైనా... మళ్లా తనకొరకు ప్రేమవాటికను నిర్మించి...స్వర్లోకజీవన-తపస్సునైనా... ఫలవంతము చేయదా, అనే...కోరికతో—

'బాగానే ఉన్నది...! నేను...ఆమెకు యిది అందజేస్తానులే...' —ఇంకా...బాబు అదేమాదిరి. నిష్కంపప్రదీపశిఖ... శివరావు అంగీకరించి...తల ఊగించాడు.

'అయితే...నాటకానికి...సీట్లు రిజర్వు చేయించావా?'

'ఆఁ...'

'టిక్కెట్లు...నాకు యిచ్చేయి. ఎక్కడ వున్నాయో చెప్పు. మోహినిని... నేను... నాటకానికి తీసుకువెళుతాను. నీవు లేని...లోపమున...కొరత ఉంటుందనుకో...కాని, ఏంచేయగలం?...'

'నోరు...ముయ్...'

—శివరావు...గర్జనతో లంఘించి...బాబు మెడ...అరచేతి వాలులో యిరికించి పట్టుకుని—

'కృతఘ్నుడవు...!నాసామగ్రి అంతా...హరించేస్తానన్నావు. నాచావు...నీకు, పండుగ అయింది...!అయినా, నేను దేనికీ కాదనలేదే...! ఇంకా, చాలక, నా...మోహినితో... మోహిని సరసను కూర్చుని...నాటకం చూస్తావా...?'

'అదికాదు. నీవులేని...కొరత...'

'జాగ్రత!...మాటలు మీరకు. నేను లేని కొరత... ఆమెకు నీవు తీరుస్తావేం...? నీలాటివాడిని... ఆమె కన్ను ఎత్తి అయినా చూస్తుందా...? ఎంత ఆలోచనఉందీ? అయినా నిన్ను అనవలసిన పని ఏముంది...లోకధర్మం...'

'నేను...వేరే ఏమీ దురుద్దేశ్యముతో...'

'బాబూ...మనసు ఏమీ బాగుండలేదు...నీవు వెళ్లు...'

'మరి...మోహినికి...నీ తుది ఉత్తరం...?'

'తుదిలేదు...మొదలు...! మనసు మార్చుకున్నాను. మోహినిని...నేనే నాటకానికి తీసుకువెళుతాను...!'

—బాబు, కలలో కుబేరవైభవమంది, మేలుకున్న...కృప ణుని విన్నదనంతో—

'నాకు...తెలుసునులే...నీ నాటకం అంతా. నన్ను ఏడి పించాలని...'

'...పో...'

'సరే...అసలుది తప్పినా...ఆ వేడి యింకా ఉడికించుతూనే ఉండే...! కానీ...రాత్రి...హాలుదగ్గర కలుసుకుంటాను...దంపతు లను...!'

—గిరవాటువచ్చిన పుస్తకం గురి తప్పించుకుని బాబు... మహా ఘనకార్యం చేసిన ధీరుడులాగా నిష్క్రమించాడు.

దంపతులు...! —ఆ మాట నొక్కగానే శివరావు మనసు అంతా వెన్నెలల మయమైపోయింది! మోహినిని వదిలివేసి...చీకటి లోకములకు, ఆత్మహతుడై పోవలసినంత దురదృష్టం...! అంతా, కల...

ఉత్సాహం...పరిణయావేశము ... వరదలైన సెలయేటి తరగలుగా...ఆతన్ని ముంచుకొని వస్తూన్నది. మోహిని...తన మోహిని...

—విప్పారి, కలతలుదీరిన చూపులతో, తోటలోని పూజొం పములను పరామర్శించుదామని, గులాబీలకోసం... అమాయి కంగా కథ పెంచి, ఇంతవరకూ తీసుకునివచ్చి...ఇలా మళ్లించిన, బటన్‌రోజ్ తీవెకోసం...చూపునిలుపగానే...మల్లెలు, జాజులు... అన్నిటినీ మించి...కొట్టవచ్చినట్టుగా, గమకంగా, అంతా కుంకుమ ముద్దలుగా విరిసిపోయిన—మందార !

*　　*　　*

మోహిని...పరిణయవిభ్రమంలో...తలపెట్టిన చిలిపితనం... ఏనాడో మరచిపోయేవాడే, కాని... బాబు...?

శివరావును...ఇంకా ఎందుకంటే ఆతనిమీద తీరని కోపం— చేసినది చాలక...తానే, ఆతని చావు తప్పించానని...బాబు అందరి తోనూ ప్రగల్భాలుకొట్టడం...!

*　*
*